క్లుప్తంగా

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. తనకు టెస్కాబ్ వైస్ చైర్మన్ పదవి రావడానికి సహకరించినా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకులు అశోక్‌గౌడ్, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

20న నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

ఆమనగల్లు: జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 20న ఒక సంవత్సరం వయసు నుంచి 19 ఏళ్ల వయసు లోపు బాలబాలికలందరికీ నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డా.పరీక్షిత్ నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో పంపిణీ చేస్తామని తెలిపారు. బడికి వెళ్లని వారికి కూడా మాత్రలు అందిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరు నులిపురుగు నివారణ మాత్రలను తీసుకోవాలని సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఇబ్రహీంపట్నం: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిపో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తమ సలహాలు, సూచనలు, సమస్యలు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఆర్టీసీ డిపో అభివృద్ధికి సహకరించాలని విన్నవించారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని సౌభాగ్యపురం కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని శాలువతో సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో సౌభాగ్యపురం కాలనీ వాసులు వెంకట్‌రెడ్డి, సుధాకర్‌గుప్త, నర్సింహారెడ్డి, మూర్తి, మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నెలకొండ శ్రీనివాస్‌రెడ్డి, గౌడుగు శ్రీనివాస్, శ్రీనివాస్, కంచర్ల శేఖర్, వెంకటేష్ గౌడ్, జైశ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

సంఘం రిజిస్ట్రేషన్‌కు వివరాల సేకరణ

వనస్థలిపురం: వనస్థలిపురం, పరిసర ప్రాంతాలలో నివాసం ఉండే మున్నూరు కాపులకు సంబంధించి సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయడానికి మున్నూరు కాపులు వివరాలు అందజేయాలని సంఘం ప్రతినిధులు మర్చెట్టి నరసింహారాజు, వంశీకృష్ణ, పత్తి రాజు ఒక ప్రక టనలో కోరారు. అందరి వివరాలు వచ్చిన త ర్వాత నూతన సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయిస్తామని తెలిపారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజారులలో కూరగాయల ధరలు (కిలో..రూపాయల్లో) ఈ విధంగా ఉన్నాయి. టమాట 47, వంకాయ 28, బెండ 55, పచ్చి మిర్చి 80, కాకర 60, బీర 72, క్యాబేజి 23, ఫ్రెంచి బీన్స్ 145, క్యారెట్ 45, దొండ 43-45, చిక్కుడు 65, గోకర 55, బీట్‌రూట్ 23, క్యాప్సికం 68, ఆలు 35, దోస 23, సొర 17, పొట్ల 20, ఉల్లిగడ్డ 39, చామగడ్డ 40గా ఉన్నాయని మార్కెట్ అధికారులు తెలిపారు. ఈ ధరలు మంగళవారం ఉ.9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఖేల్ ఇండియాకు ఎంపిక

హస్తినాపురం: కర్ణాటకలోని బాగాల్కొట్‌లో జరిగిన సౌత్‌జోన్ ఖేల్ ఇండియా పురుషులు, ఉమెన్స్ పోటీల్లో హస్తినాపురం భవిష్య స్కూల్ విద్యార్థులు పాల్గొని వివిధ పతకాలు సాధించి జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ విభాగంలో రావుల మోక్ష వెండి పతకంతోపాటు మూడువేల రూపాయల నగదు, గుద్దేటి వైష్ణవి కాంస్య పతకం, రెండువేల నగదు, జరుపుల సిరి చందన కాంస్య పతకం, రెండువేల రూపాయల నగదు బహుమతి సాధించినట్లు భవిష్య స్కూలు చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, స్కూలు ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్‌లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

బక్రీద్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. ముస్లిం మతగురువులు హిమాంలు భక్తులకు బక్రీద్ సందేశం ఇచ్చారు. అనంతరం ఒకరినొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



మాడ్గుల: పిల్లలకు బహుమతులను ఇచ్చిన పెద్దలు



ఆమనగల్లు: శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి



తుర్కయంజాల్‌లో ..



యాచారంలో..



తలకొండపల్లిలో ..



వెల్జాల్‌లో..



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లి ఈద్గా వద్ద



కడ్తాల్: శుభాకాంక్షలు తెలుపుతున్న శివప్రసాద్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



ఆమనగల్లులో..



మంచాల: ఆరుట్ల ఈద్గా వద్ద

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

కాంగ్రెస్ సీనియర్ నేత యాదగిరి

తలకొండపల్లి: మిర్యాల శ్రీను కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని కాంగ్రెస్ సీనియర్ నేత బోల యాదగిరి అన్నారు. మండల కేంద్రానికి చెందిన మిర్యాల శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వెల్దండ ఎన్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం యాదగిరి ఆస్పత్రికి వెళ్లి శ్రీను ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అందజేసిన రూ. 5000 శ్రీను కుటుంబ సభ్యులకు ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, అజీం, తదితరులు పాల్గొన్నారు. అలాగే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ హాస్పిటల్‌కు వెళ్లి శ్రీనును పరామర్శించారు. రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ ఉప సర్పంచ్ అనిల్, తదితరులు ఉన్నారు.



భరత్‌ను పరామర్శిస్తున్న వెంకటేశు, తదితరులు

తలకొండపల్లి: మండలానికి చెందిన భరత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ హాస్పిటల్లో చికిత్స తీసుకుంటున్నాడు. సోమవారం జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఆస్పత్రికి వెళ్లి భరత్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, వివరాలు అడిగి తెలుసుకొని, డాక్టర్లతో మాట్లాడారు. ఆధునిక వైద్యం అందించి త్వరగా కోలుకోనేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్



ఆమనగల్లు: నాటుసారాను తయారు చేసినా, విక్రయించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ హెచ్చరించారు. ఆమనగల్లు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు గుడుంబా రహిత తెలంగాణ కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో నాటుసారా నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇటీవల ఆయా మండలాల్లో దాడులు నిర్వహించి నాటుసారా విక్రయిస్తున్న వారిని అరెస్టు చేశామని తెలిపారు. అలాగే పలు తండాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు వివరించారు. పట్టుబడిన వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. నల్లబెల్లం, నవసాగ్రం, పటికలను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. పట్టణంతో పాటు పలు గ్రామాల్లోని కిరాణా షాపుల్లో బెల్లం విక్రయాలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి బెల్లం నేరుగా తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని, వారిని గుర్తించి కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని వెల్లడించారు. ఫంక్షన్‌హాల్‌లు, రిసార్ట్స్‌లలో అనుమతి లేకుండా మద్యం వినియోగించరాదని సూచించారు.

పీఏసీఎస్ మాజీ చైర్మన్ హనుమంతురెడ్డి మృతి

నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు



హనుమంతురెడ్డి (ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ సింగిల్ విండో మాజీ చైర్మన్, చర్లపటేల్‌గూడ మాజీ సర్పంచ్ హనుమంతురెడ్డి(70) ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. మంగళవారం తన స్వగ్రామం చర్లపటేల్‌గూడలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. హనుమంతురెడ్డి మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి స్వయానా బావమరిది. హనుమంతురెడ్డి మృతి పట్ల ఎమ్మెల్యే మల్‌రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



బ్రహ్మోత్సవాల్లో భాగంగా కూచిపూడి నృత్య రూపక ప్రదర్శన

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని స్నేహపురికాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన హంస, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డా. మద్దాళి ఉషాగాయత్రి శిష్య బృందం ప్రదర్శించిన ఇల వైకుంఠం కూచిపూడి నృత్య రూపకం ఆద్యంతం అలరించింది. మధ్యాధూల రమాకాంతాచార్య స్వామి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలోని శ్రీనివాస కల్యాణ వేదికపై శ్రీనివాసుడి కీర్తనలకు కళాకారిణుల నృత్యాభినయం అందరి మన్ననలు పొందింది. హృద్యంగా పాడిన శ్రీమన్నారాయణ తదితర కీర్తనలకు కళాకారిణుల హావభావ ప్రకటనను శాస్త్రీయ నృత్యాభిమానులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వారణాశి వంశీ, కార్యదర్శి ప్రసన్న కృష్ణ, కోశాధికారి హేమసుందర్‌రావు, ట్రస్టీ అనంతుల సురేందర్‌రెడ్డి, మేనేజర్ రవి పాల్గొన్నారు.

పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

నాగోలు: కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వర్షాలు రాకముందే కాలనీలో పైప్‌లైన్ పనులను త్వరితంగా పూర్తి చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ జలమండలి అధికారులకు ఆదేశించారు. సోమవారం నాగోలు డివిజన్‌లోని శ్రావణ శ్రీ ఎంక్లేవ్ నుంచి బండ్లగూడ భారత్ పెట్రోల్‌బంక్ వరకు సుమారు రూ. 1.20 కోట్లతో వర్షపునీరు సజావుగా వెళ్లేందుకు పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్ చింతల అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతనంగా నిర్మించబోయే వర్షపునీటి పైప్‌లైన్ పనులు నాణ్యతా ప్రమాణాలతో ఏమాత్రం తగ్గకుండా, ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా భారీ వర్షాలు రాకముందే పనులు పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కాలనీవాసులు కొరడ రామ్మోహన్ శర్మ, మాధవరెడ్డి, నాయకులు రావుల శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊర కుక్కల వీరంగం!



చింతుల్ల గ్రామంలో గుంపుగా ఉన్న వీధి కుక్కలు



కుర్మిద్దలో వీధికుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన దూడ

- మనుషులపైకి ఎగబడుతున్న వైనం
- గ్రామాల్లో గొర్రెలు, మేకలు, దూడలపై దాడులు
- కోళ్లఫాంల్లో మృతి చెందిన కోళ్లను తిని రెచ్చిపోతున్న వీధికుక్కలు
- పట్టించుకోని పంచాయతీలు
- రెండు నెలల్లో 50 మందిపై దాడులు

యాచారం: ఊర కుక్కలు ఉగ్రరూపం చూపిస్తున్నాయి. గుంపులు, గుంపులుగా సంచరిస్తూ దాడులకు ఎగబడుతున్నాయి. యాచారం మండలంలోని ఏ గ్రామంలో చూసినా 200 నుంచి 500కు పైగానే కుక్కలు ఉన్నాయి. నిత్యం ఏదో ఒక గ్రామంలో గొర్రెలు, మేకలు, దూడలపై దాడులు చేస్తున్నాయి. కుక్కల వల్ల ప్రాణహాని ఉందని, రక్షణ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులను ప్రాధేయపడుతున్నా స్పందించే వారే లేరు. గత నాలుగేళ్ల కింద ఇలాగే ఊర కుక్కల విజృంభణతో ప్రజలు భయాందోళనకు గురై తీవ్ర ఆందోళనలు చేయడంతో పంచాయతీ అధికారులు మంతన్‌గౌరెల్లి, మాల్, చింతపట్ల, యాచారం, నందివనపర్తి, తాడిపర్తి, నక్కర్తమేడిపల్లి , తక్కళ్లపల్లి , కొత్తపల్లి తదితర గ్రామాల్లోని కుక్కలను పట్టుకుని సుదూర ప్రాంతాల్లో వదిలిపెట్టారు.

వరుస దాడులతో బెంబేలు..

వరుస దాడులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నల్లవెల్లి గ్రామంలో గత పక్షం రోజుల కింద వీధి కుక్కలు గొర్రెల, మేకల మందలపై దాడులు చేసి తీవ్రంగా గాయపర్చాయి. కుర్మిద్దలో నెల రోజుల కింద ఐదు లేగ దూడలపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. అలాగే, ధర్మన్నగూడ, చింతుల్ల, మంతన్‌గౌరెల్లి, చింతపట్ల, మాల్, మొండిగౌరెల్లి, మేడిపల్లి, తక్కళ్లపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో దాడులు చేసి 200కు పైగానే గొర్రెలు, మేకలను చంపేశాయి. ఎదిరించే మనుషులను కూడా గాయపర్చాయి. గత రెండు నెలల్లో ఆయా గ్రామాల్లో 50 మందికిపై దాడులు చేశాయి. కుక్కల సంచారం వల్ల రాత్రిపూట గ్రామాల్లో తిరగాలంటేనే భయపడే పరిస్థితి ఉంది.

మృతి చెందిన కోళ్లను తినడం వల్లే...

మండలంలోని నక్కర్తమేడిపల్లి, యాచారం, తమ్మలోనిగూడ, మాల్, కుర్మిద్ద, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, నల్లవెల్లి, నందివనపర్తి, నస్దిక్‌సింగారం తదితర గ్రామాల్లో 200కు పైగానే పౌల్ట్రీఫాంలు ఉన్నాయి. వ్యాధులు సోకడం వల్ల మృతి చెందిన కోళ్లను యజమానులు సరైన జాగ్రత్తలు తీసుకోకుండానే పడేస్తున్నారు. ఇలా పడేయడంతో కుక్కలకు మంచి ఆహారంగా లభిస్తుంది. కోళ్ల మాంసాన్ని రుచి మరిగిన కుక్కలు అదేస్థాయిలో ఆహారం లభించనప్పుడు గ్రామాల్లోని గొర్రెలు, మేకలు, దూడలపై దాడులు చేస్తున్నాయి. గుంపులు, గుంపులుగా వెళ్లి దాడులు చేసి, గాయపర్చి చంపేస్తున్నాయి.

రోడ్డు నుంచి వెళ్లలేకపోతున్నాం



తక్కళ్లపల్లి-నక్కర్తమేడిపల్లి గ్రామాల మధ్యన కోళ్ల ఫారాలు ఉండడం వల్ల గుంపులు, గుంపులుగా కుక్కలు సంచరిస్తున్నాయి. ఈ రూట్లో బైక్ మీద వెళ్తే చాలు వెంటపడుతున్నాయి. ఎదిరిస్తే దాడులకు దిగుతున్నాయి. రాత్రిపూట ఈ దారిలో వెళ్లాలంటేనే భయమేస్తోంది. కుక్కల దాడుల వల్ల నిత్యం ప్రయాణికులు గాయపడుతున్నారు.

- పొద్దుటూరి సురేందర్‌గుప్తా, తక్కళ్లపల్లి

కరుస్తున్నాయి..



వీధికుక్కలు మనుషులను విచ్చలవిడిగా కరుస్తున్నాయి. ఒక్కోసారి ఇద్దరు, ముగ్గురు కుక్కకాటుకు గురైన ఆస్పత్రికి వస్తున్నారు. మండలంలోని 24 గ్రామాల నుంచి మే నెలలో 43 మంది, జూన్ నెలలో 33 మందిని కుక్కలు కరవడం జరిగింది. ఆస్పత్రికి వస్తే వెంటనే అవసరమైన ఇంజక్షన్లు ఇస్తున్నాం. కుక్కల నివారణపై పలుమార్లు మండల అధికారులకు తెలియజేశాం.

- డాక్టర్ రాజ్యలక్ష్మి, వైద్యాధికారి, యాచారం